సాక్షి రంగారెడ్డి

మంగళవారం । 30 । సెప్టెంబర్ । 2025



పరిహారం ఇవ్వాలి

గీతవృత్తిదారులకు పరిహారం అందించాలని గీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకన్నగౌడ్ డిమాండ్ చేశారు. 10లో▸



ఇళ్లు అమ్ముకుంటే ..

డబుల్ బెడ్‌రూం ఇళ్లు అమ్ముకుంటే పట్టాలు రద్దు చేసి మరొకరికి ఇస్తామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. 10లో▸



రైతుబజార్‌ను..

రైతుబజార్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్వచ్ఛంద సంస్థ సీఈఓ చందన అన్నారు. 10లో▸

న్యూస్‌రీల్

పంజాబ్ మాజీ డిప్యూటీ సీఎంకు ఘన స్వాగతం



గిరిజన మహిళలతో సుఖ్జిందర్ సింగ్ రాంధావా

నందిగామ: పంజాబ్ మాజీ ఉప ముఖ్యమంత్రి, రాజస్థాన్ ఏఐసీసీ ఇన్‌చార్జి సుఖ్జిందర్ సింగ్ రంధావాకు మండల ముఖద్వారమైన బైపాస్ రహదారి వినాయక్ స్టీల్ పరిశ్రమ సమీపంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కాంగ్రెస్ నాయకులు సోమవారం ఘన స్వాగతం పలికారు. చాకలిదాని గుట్ట తండాకు చేరుకొని గిరిజన మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి నృత్యం చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహ యాదవ్, మాజీ సర్పంచ్ రాజు నాయక్, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అస్తిత్వ పోరాటానికి సిద్ధం అవుదాం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్: అస్తిత్వ పోరాటానికి మాలలు సిద్ధం కావాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్ మాల పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా చేపట్టే ఎస్సీ ఉప వర్గీకరణను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, రోస్టర్ పాయింట్లను వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం నవంబర్ 2న హైదరాబాద్‌లో భారీ ఎత్తున మాలల రణభేరి మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. అనంతరం రణభేరికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సుంకం నర్సింహ, శ్రీను, కబీర్, మల్లేష్, గాలయ్య, వినోద్, నరేష్, శ్రీను, కుమార్, చిట్టి, అంజి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.


సదర్ ఉత్సవ కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా రవియాదవ్



షాద్‌నగర్: సదర్ ఉత్సవ కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా షాద్‌నగర్ పట్టణానికి చెందిన చీపిరి రవి యాదవ్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని సైదాబాద్‌లో సోమవారం సదర్ ఉత్సవ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అఖిల భారత యాదవ మహాసభ జాతీయ కార్యదర్శి లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీందర్, సదర్ ఉత్సవ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ యాదవ్ చేతుల మీదుగా చీపిరి రవియాదవ్ నియామక పత్రం అందుకున్నారు.

కాంగ్రెస్‌కు కాలం చెల్లింది

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ పార్టీకి కాలం చెల్లిందని, రాష్ట్రంలో రెండేళ్ల పాలన పూర్తికాక ముందే ఆ పార్టీ నిజస్వరూపాన్ని ప్రజలు గుర్తించారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ బీఆర్‌ఎస్ సమన్వయ కమిటీ సమావేశం సోమవారం శేరిగూడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అబద్ధాల మాటలతో, మోసపు వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన రీతిలో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకట రమణారెడ్డి, మాజీ ఎంపీపీ కృపేష్ తదితరులు పాల్గొన్నారు.



భారీ బతుకమ్మ వద్ద మహిళల కోలాహలం



సింగర్ గీతామాధురి గానం



కడ్తాల్: బతుకమ్మతో యువతి

పూల పరిమళం.. రికార్డు సంబురం

రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ స్టేడియంలో సోమవారం 'మహా బతుకమ్మ' వేడుకలు నిర్వహించారు. 1,500 మందితో తెలంగాణ బతుకమ్మ ఫోక్ డ్యాన్స్ అబ్బుర పరిచింది. 63 అడుగుల ఎత్తయిన భారీ బతుకమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ రెండు ప్రదర్శనలు అతిపెద్ద జానపద నృత్యంగా, అతిపెద్ద బతుకమ్మగా రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించాయి. మరోవైపు జిల్లాలో సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ఎటు చూసినా సందడి కనిపించింది.

– హుడాకాంప్లెక్స్



స్థానిక నగారా

షెడ్యూల్ విడుదల

- జిల్లాలో రెండు విడతల్లో ఎన్నికలు
- తొలి దశలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ..
- తర్వాతే పంచాయతీ, వార్డుల ఎన్నిక

ఓటర్ల వివరాలు

మొత్తం	:	7,94,653
పురుషులు	:	3,99,404
మహిళలు	:	3,95,216
ఇతరులు	:	33

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎప్పుడెప్పుడా అని అంతా ఆశగా ఎదురు చూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగింది. ఇప్పటికే ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీఓ జారీ చేసిన నేపథ్యంలో తాజాగా ఎన్నికల సంఘం పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. దీంతో ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఆశావహులు వ్యూహాలకు పదునుపెడుతున్నారు. తొలి విడతలో పార్టీ గుర్తులపై నిర్వహించే జిల్లా/మండల ప్రాదేశిక స్థానాలకు ఎన్నికలు నిర్వహించి, తర్వాత సర్పంచ్, వార్డులకు ఓటింగ్ జరుగనుంది. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు జరుగుతుండగా, మన జిల్లాలో మాత్రం రెండు (ఫేజ్-2, ఫేజ్-3) విడతల్లోనే ఎన్నికల ప్రక్రియ పూర్తి కానుంది. ఇదిలా ఉంటే ఆశించిన దానికి భిన్నంగా స్థానిక సంస్థలకు రిజర్వేషన్లు ఖరారు కావడం, ఇప్పటి వరకు ఆయా స్థానాల్లో పోటీ చేయాలని భావించి ఆశావహులకు తీరా పోటీ చేసే అవకాశం లేకుండా పోయిన విషయం తెలిసి నిరాశలో మునిగిపోయా. జిల్లాలో 21 జెడ్పీటీసీ స్థానాలు, 230 ఎంపీపీ స్థానాలు ఉన్నాయి. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు అక్టోబర్‌లో రెండు విడతల్లో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి నవంబర్ 11న ఫలితాలు ప్రకటించనున్నారు. జిల్లాలో మొత్తం 526 పంచాయతీలు ఉండగా, 4,668 వార్డులు ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచ్ స్థానాలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనుండగా జిల్లాలో మాత్రం రెండు (ఫేజ్-2, ఫేజ్-3) విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఓటింగ్ ముగిసిన వెంటనే ఫలితాలు ప్రకటించనున్నారు.

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల షెడ్యూల్

	తొలిదశ	రెండోదశ
జిల్లా ప్రాదేశిక స్థానాలు	10	11
మండల ప్రాదేశిక స్థానాలు	110	120
నోటిఫికేషన్ జారీ	అక్టోబర్ 9న	అక్టోబర్ 13న
నామినేషన్ల స్వీకరణ, తుదిగడువు	9 నుంచి 11 వరకు	13 నుంచి 15 వరకు
పరిశీలన, జాబితా ప్రకటన	12న	16న
అభ్యంతరాల స్వీకరణ	13న	17న
అభ్యంతరాల పరిశీలన	14న	18న
ఉపసంహరణ, తుది జాబితా ప్రకటన	15	19
పోలింగ్	23	27
ఓటింగ్ సమయం	ఉ.7 నుంచి సా.5 గం.వరకు	ఉ.7 నుంచి సా.5 గం.వరకు
ఓట్ల లెక్కింపు	నవంబర్ 11న ఉ.8 గంటలకు	నవంబర్ 11న ఉ.8 గంటలకు

పంచాయతీలు/వార్డుల ఎన్నికల షెడ్యూల్

	తొలిదశ	రెండోదశ
గ్రామ పంచాయతీలు	264	262
వార్డులు	2,300	2,368
నోటిఫికేషన్	అక్టోబర్ 21	అక్టోబర్ 25
నామినేషన్ల స్వీకరణ, తుదిగడువు	21 నుంచి 23 వరకు	25 నుంచి 27 వరకు
పరిశీలన, అభ్యర్థుల జాబితా ప్రకటన	24	28
అభ్యంతరాల స్వీకరణ	25	29
అభ్యంతరాల పరిశీలన	26	30
ఉపసంహరణ, తుది జాబితా ప్రకటన	27	31
పోలింగ్	నవంబర్ 4	నవంబర్ 8న
ఓటింగ్ సమయం	ఉ.7 నుంచి మ. 1గం.వరకు	ఉ.7 నుంచి మ.1గం.వరకు
ఓట్ల లెక్కింపు	నవంబర్ 4 మధ్యాహ్నం తర్వాత	నవంబర్ 8న మధ్యాహ్నం తర్వాత

9 మహిళలకు బీసీలకు..

- స్థానిక సంస్థల రిజర్వేషన్లు ఖరారు
- గెజిట్ జారీ చేసిన జిల్లా ఎన్నికల అధికారి
- జిల్లా వ్యాప్తంగా 21 జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు
- వీటిలో తొమ్మిది బీసీలకు, నాలుగు ఎస్సీలకు
- మూడు ఎస్టీలకు, ఐదు జనరల్‌కు కేటాయింపు
- జనరల్‌లో ఐదు స్థానాలు కేటాయింపు

జెడ్పీటీసీ/ఎంపీపీ స్థానాల కేటాయింపు ఇలా..

కేటగిరీ	మొత్తం	మహిళలు	పురుషులు/మహిళలు
ఎస్టీ	3	1	2
ఎస్సీ	4	2	2
బీసీ	9	4	5
జనరల్	5	2	3
మొత్తం	21	9	12

సాక్షి, రంగారెడ్డిజిల్లా: స్థానిక సంస్థలకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. ఈ మేరకు సోమవారం జిల్లా ఎన్నికల కమిషన్ గెజిట్ విడుదల చేసింది. ఇప్పటికే జెడ్పీ పీఠాన్ని ఖరారు చేసిన ఎన్నికల కమిషన్ తాజాగా జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ సహా గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులకు సంబంధించిన రిజర్వేషన్లు ఖరారు చేసి జాబితాను వెల్లడించింది. జిల్లాలో 21 జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు ఉండగా, వీటిలో తొమ్మిది బీసీలకు, నాలుగు ఎస్సీలకు, మూడు ఎస్టీలకు, ఐదు జనరల్ కేటగిరీ కోసం కేటాయించారు. మొత్తం జెడ్పీటీసీ, ఎంపీపీ సీట్లలో తొమ్మిది మహిళలకు కేటాయించారు. 230 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, వీటిలో 94 స్థానాలను మహిళలకు కేటాయించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 25 స్థానాలు ఎస్టీలకు, 49 స్థానాలు ఎస్సీలకు కేటాయించారు. డెడికేషన్ కమిటీ నివేదిక ప్రకారం 97 స్థానాలు బీసీలకు కేటాయించారు. మిగిలిన 59 స్థానాలను జనరల్ కేటగిరీ కోసం కేటాయించారు. ఇదిలా ఉంటే జిల్లాలో 526 పంచాయతీలకు సైతం రిజర్వేషన్లు ఖరారు చేశారు.

జిల్లా ప్రాదేశిక స్థానాలకు రిజర్వేషన్లు ఇలా

ఎస్టీ: మంచాల, కొత్తూరు, ఫరూఖ్‌నగర్ (మహిళ).
ఎస్సీ: శంకర్‌పల్లి, చేవెళ్ల, కందుకూరు (మహిళ), షాబాద్ (మహిళ).
బీసీ: మొయినాబాద్ (మహిళ), కొందుర్గు, ఇబ్రహీంపట్నం (మహిళ), కేశంపేట యాచారం, మహేశ్వరం (మహిళ), తలకొండపల్లి, మాడ్గుల, కడ్తాల్ (మహిళ).
జనరల్: అబ్దుల్లాపూర్‌మెట్ (మహిళ), జిల్లేడుచౌదరిగూడెం, నందిగామ (మహిళ) శంషాబాద్, ఆమనగల్లు.

మండల పరిషత్‌ల రిజర్వేషన్లు ఇలా..

ఎస్టీ: కొత్తూరు (మహిళ), ఫరూఖ్‌నగర్, తలకొండపల్లి.
ఎస్సీ: శంకర్‌పల్లి (మహిళ), చేవెళ్ల, షాబాద్, శంషాబాద్ (మహిళ).
బీసీ: జిల్లేడు చౌదరిగూడెం, మొయినాబాద్, కొందుర్గు, ఇబ్రహీంపట్నం (మహిళ), కేశంపేట (మహిళ), కందుకూరు (మహిళ), యాచారం, మహేశ్వరం (మహిళ), మంచాల
జనరల్: అబ్దుల్లాపూర్‌మెట్ (మహిళ), నందిగామ, మాడ్గుల, కడ్తాల్(మహిళ), ఆమనగల్లు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరిస్తూ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి ఆర్డీఓలు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఎన్నికల విధుల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన విధులను నిర్వర్తించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, నోడల్ అధికారులు, ఆర్డీఓలు, ఎంపీడీఓలు, ఎంపీఓలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జంట జలాశయాల చుట్టూ వాలిన గద్దలు!

పెద్దల భూములు మునగకుండా.. వచ్చిన నీళ్లు వచ్చినట్లే దిగువకు

- మొయినాబాద్, శంకర్‌పల్లి, శంషాబాద్ మండలాల్లో ముంచెత్తిన వరద
- దిగువన నీట మునిగిన పేదల ఇళ్లు, పంట పొలాలు
- శాపంగా అధికారుల సమన్వయ లోపం

సాక్షి, రంగారెడ్డి జిల్లా/మొయినాబాద్: హైదరాబాద్ మహానగర ప్రజల దాహార్తి తీర్చేందుకు నిర్మించిన జంట జలాశయాలు ప్రమాదంలో పడ్డాయి. చుట్టూ పెద్ద గద్దలు వాలడం, ఆక్రమణలు జరగడం, పూడిక పేరుకుపోవడం, అధికారుల సమన్వయ లోపంతో జలాశయాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. రెండు నెలలుగా కురుస్తున్న వర్షాలతో జలాశయాల్లోకి భారీ వరదలు రావడంతో నిర్వహణ లోపాలు బయట పడుతున్నాయి. పెద్దల ఫాంహౌస్‌ల్లోకి నీళ్లు వెళ్లకుండా వచ్చిననీళ్లు వచ్చినట్లే వదిలేయడంతో దిగువన పేదల ఇళ్లు మునిగాయి. జలాశయాల ఎగువ ప్రాంతాల్లో భారీ వరదలు పంటపొలాలను ముంచెత్తాయి.

కబ్జాలను గుర్తించినా చర్యలు శూన్యం

నగర శివారుల్లో నిజాం కాలంలో హైదరాబాద్‌కు వరద ముప్పును తప్పించడంతోపాటు తాగునీటిని అందించేందుకు ఉస్మాన్‌సాగర్(గండిపేట), హిమాయత్‌సాగర్ జలాశయాలను నిర్మించారు. దశాబ్దాలపాటు జంట జలాశయాల నుంచి హైదరాబాద్‌కు తాగునీరు అందుతోంది. కొన్నేళ్లుగా గండిపేట, హిమాయత్‌సాగర్ జలాశయాల చుట్టూ పెద్దలు భూములు కొనుగోలు చేశారు. రాజకీయ, వ్యాపార, సినీ రంగాలతోపాటు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సైతం జలాశయాలను ఆనుకుని ఉన్న భూములను కొనుగోలు చేసి ఫాంహౌస్‌లు, ఇతర నిర్మాణాలు చేపట్టారు. కొందరు బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌ను సైతం ఆక్రమించి మట్టితో నింపి ఎత్తు పెంచి నిర్మాణాలు చేపట్టారు. పదిహేనేళ్ల క్రితమే హెచ్ఎండీఏ, జలమండలి, ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల ఆధ్వర్యంలో సర్వేలు చేసి సుమారు 600 ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు తేల్చారు. హిమాయత్‌సాగర్ జలాశయం పరిధిలో 390 ఎకరాలు, గండిపేట జలాశయం పరిధిలో 210 ఎకరాల వరకు కబ్జాలకు గురైనట్లు గుర్తించారు. ఇప్పటి వరకు ఆ భూములను తిరిగి స్వాధీనం చేసుకోలేదు. దీనికి తోడు వందేళ్ల క్రితం నిర్మించిన జలాశయాల్లో ఇప్పటి వరకు ఒక్కసారి కూడా పూడిక తీయకపోవడంతో జలాశయాలు కుంచించుకుపోయాయి. మరోవైపు జలాశయాలకు వరద నీరు వచ్చే ఈసీ, మూసీ పరీవాహక ప్రాంతాల్లోనూ పెద్ద ఎత్తున ఆక్రమణలు జరిగాయి. వాగులు, వంకలను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారు. ఆక్రమణలు, అక్రమ నిర్మాణాల ప్రభావం భారీ వరదలతో పంటపొలాలపై పడింది. పరీవాహక ప్రాంతంలోని పంటలు నీటమునగడంతోపాటు పొలాలు కోతకు గురయ్యాయి.

అధికారుల సమన్వయ లోపం

జలాశయాల్లోకి రెండు రోజుల క్రితం వచ్చిన వరదను అధికారులు ముందుగానే అంచనా వేయలేకపోయారు. భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ ముందు నుంచే హెచ్చరికలు జారీ చేసినా జల మండలి అధికారుల సమన్వయ లోపం మూసీ ఉగ్రరూపం దాల్చడానికి కారణమైనట్లు తెలుస్తోంది. ఈ నెల 26, 27న వికారాబాద్ జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు ఉన్నట్లు వాతావరణ శాఖ ముందే హెచ్చరించింది. 26న తెల్లవారుజాము నుంచే వికారాబాద్ జిల్లాలోని పరిగి, పూడూరు, వికారాబాద్, మోమిన్‌పేట్, నవాబ్‌పేట్ మండలాలతోపాటు రంగారెడ్డి జిల్లాలోని జిల్లేడ్‌చౌదరిగూడ, కొందుర్గు, షాబాద్, చేవెళ్ల, మండలాల్లో భారీ వర్షాలు కురిసాయి. ఈసీ, మూసీ నదులు ఒక్కసారిగా ఉప్పొంగి ప్రవహించి మొయినాబాద్, శంకర్‌పల్లి, శంషాబాద్ మండలాల్లోని వందల ఎకరాల్లో పంట పొలాలను ముంచెత్తాయి.ఎగువన కురిసిన వర్షాని ,భారీగా వస్తున్న వరదలను ముందుగానే అంచనా వేయడంలో జలమండలి అధికారులు విఫలమయ్యారు. జలాశయాల్లోకి ఇన్‌ఫ్లో పెరిగిన కొద్దీ దిగువకు ఔట్‌ఫ్లోను గంట గంటకూ పెంచుతూ వెళ్లారు. దీంతో మూసీ తన ఉగ్రరూపాన్ని చూపించి హైదరాబాద్‌లో లోతట్టు ప్రాంతాలను ముంచెత్తింది.



శంకర్‌పల్లి మండలం పొద్దటూరు వద్ద పంటచేలను ముంచెత్తిన మూసీ వరద



శంషాబాద్, మొయినాబాద్ మండలాల మధ్య పొలాలను ముంచెత్తిన ఈసీవాగు వరద

వర్షాలు.. వరదలతో..

రెండు నెలలుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అప్పటి నుంచి జంట జలాశయాల్లోకి ఈసీ, మూసీ వాగుల ద్వారా వరద వస్తూనే ఉంది. నెల రోజుల క్రితమే జలాశయాలు నిండుకుండలను తలపించడంతో దిగువకు నీటిని వదులుతున్నారు. జలాశయాల చుట్టూ ఉన్న పెద్దల భూముల్లోకి బ్యాక్ వాటర్ వెళ్లకుండా జలాశయాల పూర్తిస్థాయి నీటి మట్టం కంటే ఒక అడుగు మేర తక్కువ ఉన్నప్పుడే నీటిని దిగువకు వదులుతున్నారు. నెల రోజుల నుంచి వచ్చిననీళ్లు వచ్చినట్లే మూసీలోకి వదులుతున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్

కార్పెంటర్ దుర్మరణం


శివశంకర్(ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: టిప్పర్ ఢీకొని కార్పెంటర్ మృతి చెందిన ఘటన పట్టణంలోని పాతజాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ శరత్‌కుమార్ తెలిపిన ప్రకారం.. పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న శివశంకర్(33) ఈశ్వర్‌కాలనీలో కార్పెంటర్ షాపు నడుపుతున్నాడు. ఆదివారం అర్ధరాత్రి తన షాపు మూసి బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో మహబూబ్‌నగర్ రోడ్డులోని యమ్మీ బేకరీ ఎదురుగా ఉన్న దుకాణానికి వెళ్లి రోడ్డుపైకి వస్తుండగా టిప్పర్ వెనుక నుంచి వేగంగా వచ్చి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శివశంకర్ తలకు తీవ్ర గాయాలై కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి వివరాలను తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు టిప్పర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మృతుడి సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇళ్లు అమ్ముకుంటే పట్టాలు రద్దు

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- అజీజ్‌నగర్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రారంభోత్సవం


పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్: ప్రభుత్వం ఇచ్చిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను అమ్ముకుంటే పట్టాలు రద్దు చేసి ఇళ్లను మరొకరికి ఇస్తామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సోమవారం ప్రారంభోత్సవం చేసి 34 మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లను ఇతరులకు అమ్ముకోవద్దన్నారు. ఓఆర్‌ఆర్‌కు అతి సమీపంలో బీజాపూర్ హైవే పక్కన నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు విలువైనవన్నారు. ఇళ్లు అందని అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. త్వరలోనే సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, హౌసింగ్ పీడీ చంప్లానాయక్, చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ, మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్, పీఆర్ ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హర్షం వ్యక్తం చేసిన సీపీఎం నాయకులు

అజీజ్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులకు అప్పగించడం హర్షనీయమని సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని ఎన్నో పోరాటం చేశామని.. తమ పోరాట ఫలితంగా ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించిందన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

మూసాపేట: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన కరుణాకర్, చరణ్ సూర్జా మల్లంపేట్‌లో సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తుండగా, సుజిత్ మహంతి ప్లంబర్‌గా పని చేస్తున్నాడు. ముగ్గురూ ఒకే ప్రాంతానికి చెందిన వారు కావడంతో సులువుగా డబ్బులు సంపాదించేందుకు గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఒడిశాకు వెళ్లి 3.78 కేజీల గంజాయిని కొనుగోలు చేసి బస్సులో నగరానికి తీసుకువచ్చారు. దానిని విక్రయించేందుకు వారు ముగ్గురూ కూకట్‌పల్లిలోని బీజేపీ కార్యాలయం వద్ద ప్రయత్నాలు చేస్తుండటంతో దాడి చేసిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 3.78 కేజీల గంజాయి, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

రూ.పది లక్షల పరిహారం ఇవ్వాలి


సమావేశంలో పాల్గొన్న గీత వృత్తిదారులు

- కల్లు గీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకన్నగౌడ్

మొయినాబాద్: గీత వృత్తిదారులు చెట్టుమీది నుంచి పడి మరణించినా.. శాశ్వత దివ్యాంగులైనా ప్రభుత్వం వెంటనే రూ.పది లక్షల పరిహారం అందజేయాలని కల్లుగీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అయిలి వెంకన్నగౌడ్ డిమాండ్ చేశారు. మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో జిల్లా అధ్యక్షుడు తాళ్ల శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో గౌడ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకన్నగౌడ్ మాట్లాడుతూ.. కల్లుగీత వృత్తి రక్షణకోసం, గౌడ సంక్షేమంపై కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను వెంటనే అమలు చేయాలన్నారు. మెజార్టీ టీఎఫ్‌టీ లైసెన్సుదారుల అనుమతి ఉంటే తక్షణమే కల్లుగీత సొసైటీని ఏర్పాటు చేయాలన్నారు. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రామకృష్ణగౌడ్, గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

యాచారం: అక్రమంగా తరలిస్తున్న పశువులను పోలీసులు పట్టుకున్నారు. యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని గడ్డమల్లయ్యగూడ గ్రామం మీదుగా ఆదివారం రాత్రి ఓ బొలేరో వాహనంలో ఎనిమిది పశువులను అక్రమంగా తరలిస్తుండగా యాచారం పోలీసులు పట్టుకున్నారు. పశువులను తరలిస్తున్న వాహనం డ్రైవర్ అనిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. పశువులను గోశాలకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

శేషవాహనంపై శ్రీవారు


శేషవాహన సేవలో పాల్గొన్న భక్తులు

చేవెళ్ల: నవరాత్రి దసరా ఉత్సవాల్లో భాగంగా చేవెళ్లలోని బాలాజీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో రాత్రి స్వామివారిని శేష వాహనంపై ఊరేగించారు. గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఆలయ పూజారులు వామనాచార్యులు, కన్న, శ్రీపాదు, వాసుదేవాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రైతుబజార్‌ను వినియోగించుకోండి

- మైక్రోసాఫ్ట్ యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సీఈఓ చందన


రైతుబజార్‌ను ప్రారంభిస్తున్న చందన తదితరులు

షాబాద్: రైతుబజార్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మైక్రోసాఫ్ట్ యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సీఈఓ చందన అన్నారు. సోమవారం చందనవెల్లిలో మైక్రోసాఫ్ట్ యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ వారి సౌజన్యంతో గ్రామ అభివృద్ధిలో భాగంగా రైతుబజార్ షెడ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో సుమారు 40 మంది వరకు రైతులు కూరగాయలు విక్రయించేలా రైతుబజార్ నిర్మాణం చేపట్టామన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలో అత్యాధునిక పరికరాలతో సైన్స్‌ల్యాబ్ ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. అంగన్‌వాడీ కేంద్రానికి ప్రహరీ నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి హర్షవర్ధన్, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సీనియర్ మేనేజర్ భరత్, మధుమతి, మేనేజర్ మహేశ్వరి, సాయికిరణ్, మాజీ సర్పంచ్ కొలన్ ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు స్వామి, గ్రామస్తులు రామస్వామి, కిష్టయ్య, మల్లేష్, వెంకటేష్, గోపాల్, రాఘవచారి, రాంచందర్, శ్రీనివాస్, బేగరి యాదయ్య, నరేశ్, రాజమల్లు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోయిన చైన్ స్నాచర్

వృద్ధురాలి మెడలోంచి పుస్తెలతాడు చోరీ

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల ఠాణా పరిధిలో సోమవారం ఓ చైన్ స్నాచర్ చేతివాటం ప్రదర్శించాడు. సీఐ రవికుమార తెలిపిన ప్రకారం.. రాగన్నగూడ శోభానగర్‌లో నివాసం ఉండే దాశరథి చెన్నమ్మ(60) ఎన్టీఆర్ నగర్‌లో కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తుంది. ఉదయం 5.30గంటల ప్రాంతంలో చెన్నమ్మ రాగన్నగూడ సబ్‌స్టేషన్ సమీపంలో కూరగాయలు పట్టుకుని నడుచుకుంటూ బస్టాండ్‌కు వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తి వెనకాల నుంచి వచ్చి ఆమె మెడలో ఉన్న మూడు తులాల మంగళసూత్రం లాక్కుని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కష్టపడి.. అనుకున్నది సాధించి

నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువకుడు


వంశీకృష్ణ

కందుకూరు: పట్టుదల, సంకల్పం ఉంటే జీవితంలో అనుకున్నది సాధించడం సులువని నిరూపించాడు ఆ యువకుడు. ఒకటి కాదు నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత సాధించాడు మండల పరిధిలోని ముచ్చర్లకు చెందిన సాట వంశీకృష్ణ. డిగ్రీ వరకు చదివిన అతను మొదటిసారి 2018లో పోలీస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించారు. ఓ పక్క ఉద్యోగం చేస్తూనే మరోవైపు రాష్ట్రస్థాయిలో అత్యున్నత ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా ప్రిపరేషన్ ప్రారంభించి 2024లో గ్రూప్‌-4 ఫలితాల్లో ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం శంషాబాద్ మున్సిపల్ కార్యాలయంలో అకౌంటెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల విడుదలైన గ్రూప్‌-3 ఫలితాల్లో సైతం రాష్ట్రస్థాయిలో 164వ ర్యాంకు, ఆదివారం విడుదలైన గ్రూప్‌-2 ఫలితాల్లో ఏఎస్‌ఓగా అర్హత సాధించి తన ప్రతిభను చాటుకున్నారు. పట్టుదలతో నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ఆ యువకుడ్ని స్నేహితులు, గ్రామస్తులు అభినందిస్తున్నారు.

అక్టోబర్ 2న మంథన్ సంవాద్

సాక్షి,సిటీ బ్యూరో: హైదరాబాద్ నగరం మరోసారి మంథన్ సంవాద్ వేదిక కాబోతుంది. అక్టోబర్ 2న శిల్పారామంలో మంథన్ సంవాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే కార్యక్రమంలో వివిధ రంగాల నిపుణులు, మేధావులు, రచయితలు, శాస్త్రవేత్తలు, న్యాయవాదులు, కళాకారులు, జర్నలిస్టులు, విద్యార్థులు హాజరై వివిధ అంశాలపై చర్చిస్తారన్నారు. 2005లో ప్రారంభమైన మంథన్ సంవాద్‌లో ఇప్పటి వరకు 400కు పైగా ప్రసంగాలు నిర్వహించగా సుమారు 60,000 మందికి పైగా సభ్యులు భాగస్వాములైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఏటా గాంధీ జయంతి రోజున ఈ వేడుక నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు.

సైనిక కుటుంబాల కోసం ఆర్థిక అక్షరాస్యత

సాక్షి, సిటీబ్యూరో: సీడీఎస్‌ఎల్ ఇన్వెస్టర్ ప్రొటెక్షన్ ఫండ్ (సిడిఎస్‌ఎల్ ఐపీఎఫ్) ఆధ్వర్యంలో సాయుధ దళాల అధికారులు , వారి కుటుంబాల కోసం పెట్టుబడి అవగాహన కార్యక్రమాలను నగరంలో నిర్వహించారు. ఎంపవరింగ్ అవర్ ప్రొటెక్టర్స్ కింద, సికింద్రాబాద్‌లోని కంటోన్మెంట్, బోయిన్‌పల్లి మిలిటరీ స్టేషన్, మెహిదీపట్నం మిలిటరీ ప్రాంతాల్లో వీటిని విజయవంతంగా నిర్వహించినట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో నిపుణులు మాట్లాడిన ముఖ్య అంశాల్లో సెక్యూరిటీల మార్కెట్ పరిచయం, పెట్టుబడి మోసం నుంచి రక్షణ ఉన్నాయన్నారు.

బతుకమ్మ పూల కోసం వెళ్లి....

ప్రమాదవశాత్తు సంపులో పడి వ్యక్తి మృతి

హయత్‌నగర్: బతుకమ్మ పండుగ నేపథ్యంలతో పూలు తెచ్చేందుకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు పాడుబడిన సంపులో పడి మృతి చెందిన సంఘటన సోమవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది... స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హయత్‌నగర్ డివిజన్, కమర్షియల్ టాక్స్ కాలనీకి చెందిన సుర్కంటి అశోక్‌రెడ్డి (55) లారీల వ్యాపారం చేసేవాడు. అనారోగ్యం కారణంగా కొంత కాలంగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. సోమవారం ఉదయం బతుకమ్మ పూలు తెచ్చేందుకు వెళ్లిన అతను ప్రమాదవశాత్తు ఇంటి సమీపంలో పూడ్చి వేయకుండా వదిలేసిన పాడుబడిన సంపులో పడిపోయాడు. మధ్యాహ్నం వరకు అతను ఇంటికి రాకపోవడంతో గాలింపు చేపట్టిన కుటుంబ సభ్యులు సంపులో పడిపోయినట్లు గమనించారు. దీంతో పోలీసులకు సమాచారం అందించడంతో ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని అశోక్‌రెడ్డి మృతదేహాన్ని బయటికి తీశారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ కళ్లె నవజీవన్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తమ్ముడి హత్య కేసులో నిందితుడి రిమాండ్

సంతోష్‌నగర్: శుభకార్యానికి ఆహ్వానించలేదనే కోపంతో తల్లితో గొడవ పడేందుకు వచ్చి సోదరుడి హత్య చేసిన కేసులో నిందితుడిని సోమవారం కంచన్‌బాగ్ పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం ఇన్‌స్పెక్టర్ కమల్ కుమార్ వివరాలు వెల్లడించారు. హఫీజ్‌బాబానగర్ బి-బ్లాక్ ప్రాంతంలో నివాసం ఉంటున్న షేక్ ముక్తార్, షేక్ ఈసా అన్నదమ్ములు. షేక్ ఈసాను ఇటీవల బంధువు సలేహా బేగం కుమారుడు నిశ్చితార్థానికి ఆహ్వానించలేదు. దీంతో మనస్తాపానికి లోనైన షేక్ ఈసా తన తల్లి నస్రీన్ బేగంతో పాటు సోదరులు షేక్ ఇషాక్, షేక్ ముక్తార్‌లతో మాట్లాడేందుకు ఈ నెల 27న రాత్రి హఫీజ్‌బాబానగర్‌లోని ఇంటికి వచ్చాడు. అందరూ కలిసి మాట్లాతుండగా కోపోద్రిక్తుడైన షేక్ ఈసా కత్తితో సోదరుడు షేక్ ముక్తార్‌పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన షేక్ ముక్తార్‌ను చికిత్స నిమిత్తం ఒవైసీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. షేక్ ముక్తార్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడు షేక్ ఈసాను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

12న ఓబీసీల జాతీయ సదస్సు

హిమాయత్‌నగర్: దేశ జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 12న విజయవాడలో ఓబీసీల జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో దక్షిణ భారత బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జబ్బాల శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సదస్సు పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. సదస్సులో దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళకు చెందిన వేలాది మంది ఓబీసీలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యఅతిథులుగా నలుగురు కేంద్రమంత్రులు, వివిధ పార్టీలకు చెందిన 20 మంది పార్లమెంట్ సభ్యులు, మేధావులు, ప్రొఫెసర్లు పాల్గొంటారని తెలిపారు. అనంతరం హైదరాబాద్, బెంగుళూరు, తమిళనాడు, ఢిల్లీలో కూడా ఓబీసీల జాతీయ సదస్సులు నిర్వహించి సత్తా తెలియజేస్తామని అన్నారు. 1931లో బ్రిటీష్ ప్రభుత్వం తీసిన లెక్కల తరువాత మరే ప్రభుత్వం చేపట్టలేదని, కేంద్రలోని బీజేపీ తొలిసారిగా జనగణనలో కులగుణన చేపట్టబోతున్నదని, ఇది దేశచరిత్రలో రికార్డు అని పేర్కొన్నారు. అన్ని కోణాలలో కులగణన తరువాత సమాజంలో విప్లవాత్మకమైన మార్పు వస్తుందన్నారు. కేంద్రంలో బీసీ బడ్జెట్లో రూ.రెండు లక్షల కోట్లు కేటాయించాలని కోరారు. సమావేశంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గుజ్జ సత్యం, నాయకులు సి.రాజేందర్ ముదిరాజ్, భూపేష్ సాగర్, పగిళ్ళ సతీష్, మణికంత, చిక్కుడు బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా పశువుల కొట్టం


రాగన్నగూడ వార్డు కార్యాలయం ఎదుట బైఠాయించిన రైతు కుటుంబం


కూల్చివేసిన పశువుల కొట్టం

- కూల్చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు
- వార్డు కార్యాలయం ఎదుట బాధితుల నిరసన

తుర్కయంజాల్: పశువుల కొట్టం నిర్మాణం వివాదానికి తెరలేపింది. బాధితుల తెలిపిన ప్రకారం.. తుర్కయంజాల్‌లోని సర్వే నంబర్ 10లో ఉన్న పొలంలో కొత్తకుర్మ ప్రకాశ్ కుటుంబ సభ్యులు గేదెలు ఉంచేందుకు ఓ షెడ్ నిర్మాణం చేపట్టారు. ఇందుకు సంబంధించి మున్సిపల్ అధికారులకు వరుసగా ఫిర్యాదులు అందిన నేపథ్యంలో పనులు నిలిపివేయించారు. సోమవారం టీపీఓ దినేశ్ జేసీబీతో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయించారు. దీంతో ఆగ్రహించిన ప్రకాశ్ కుటుంబీకులు జేసీబీని అడ్డుకుని డ్రైవర్ సెల్‌ఫోన్‌ను ధ్వంసం చేశారు. అక్కడ నుంచి నేరుగా రాగన్నగూడ వార్డు కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. తమపై ఫిర్యాదు చేసిన వ్యక్తి సైతం భారీ షెడ్ నిర్మించాడని, ఫాం హౌస్ నిర్మించాడని వాటిని కూల్చివేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు పశువుల కొట్టాన్ని కూల్చివేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా విధుల్లో ఉన్న ప్రభుత్వ అధికారితో దురుసుగా ప్రవర్తించినందుకుగాను ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేస్తానని టీపీఓ దినేష్ తెలిపారు.

తహసీల్దార్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు


కలెక్టర్ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న రాజు

ఇబ్రహీంపట్నం రూరల్: బీసీ–సీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకుంటే ఇబ్రహీపట్నం ఓసీ సర్టిఫికెట్ ఇస్తాం.. లేదంటే జైలుకు పంపుతామని బెదిరింపులకు పాల్పడుతోందని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఇబ్రహీంపట్నం క్రిస్టియన్ కో ఆర్డినేటర్ చెరుకురూరి రాజు తెలిపిన ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చిట్యాల సుచరిత పురుషోత్తం దంపతులు ఎస్సీ కులానికి చెందినవారు. కన్వర్ట్ క్రిస్టియన్ కావడంతో గతంలో బీసీ–సీ సర్టిఫికెట్ పొందారు. 5వ తరగతి చదువుతున్న తమ కుమారుడికి బీసీ–సీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోగా ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీతారెడ్డి చట్ట ప్రకారం ఇవ్వడం కుదరదని.. థర్డ్ జనరేషన్ కావడంతో ఓసీ సర్టిఫికెట్ ఇస్తామని లేదంటే జైలుకు పంపుతామని బెదిరింపులకు పాల్పడుతుందన్నారు. దీంతో సోమవారం నిర్వహించిన కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశామన్నారు. ప్రజలకు సేవలందించాల్సిన అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని వారిపై తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. అబ్బాయికి బీసీ సీ సర్టిఫికెట్ లేదా ఎస్సీ సర్టిఫికెట్ ఇప్పించి న్యాయం చేయాలని కోరారు .

నీట మునిగిన పంటలు


మొయినాబాద్‌రూరల్: నీటి మునిగిన పూల తోటలు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కుంటల సమీపంలోని పంటలు నీట మునిగాయి. నక్కలపల్లి కుంట, అమ్డాపూర్ పటేల్ కుంట సమీపంలో పత్తి, బంతి పూల తోటలు పాడయ్యాయి. అధికారులు పంటలు పరిశీలించి పరిహారం అందజేయాలని రైతులు కోరుతున్నారు.

రోడ్డుపై చేరిన వరద


మొయినాబాద్: పెద్దమంగళారంలో ఊరుముందు కుంట నిండి రోడ్డుపైకి చేరిన నీరు

మొయినాబాద్: మున్సిపల్ పరిధిలోని పెద్దమంగళారంలో ఊరుముందుకుంట ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా నిండింది. గ్రామంలోని మురుగు నీరు సైతం ఇదే కుంటలోకి వెళ్లడంతో పూర్తిస్థాయిలో నిండి నీరంతా రోడ్డుపైకి చేరింది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది అవుతుందని.. కుంట సమీపంలోని ఇళ్లలోకి దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుంటలోని నీరు కిందికి వదిలి తమ ఇబ్బందులను తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.


మొయినాబాద్‌రూరల్ నక్కలపల్లి కుంటలో మునిగిన పత్తి పంట